## అభివృద్ధి పనులు ప్రారంభం

నందిగామ, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఎంపీడీవో భవనం స్లాబ్ నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురాన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చంద్రపాల్‌రెడ్డి, కొమ్ముకృష్ణ, కుమారస్వామిగౌడ్, నాయకులు రాంరెడ్డి, నర్సింహ, రామస్వామిగౌడ్, అంజి, కృష్ణ, రమేశ్, జంగయ్యగౌడ్, రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడికి డాక్టరేట్ ప్రదానం



తుర్కయాంజాల్, ఏప్రిల్ 18 : మున్సిపాలిటీ పరిధి మునగనూర్ టెలిఫోన్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాంకు ఢిల్లీకి చెందిన ఏసీయా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. గురువారం రాత్రి హైదారాబాద్ నాంపల్లిలోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డాక్టరేట్ అందజేసినట్లు లచ్చిరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత, సామాజిక సేవా అంశంలో డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని అన్నారు.

## కానిస్టేబుల్‌కు సన్మానం



రాజేందర్‌కు హెడ్ కానిస్టేబుల్ బ్యాడ్జ్‌ను అందజేస్తున్న సీఐ గంగాధర్

కడ్తాల్, ఏప్రిల్ 18: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నాలుగేండ్లుగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేందర్‌కు హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్ రాజేందర్‌కు హెడ్ కానిస్టేబుల్ బ్యాడ్జ్‌ను అందజేశారు. అనంతరం రాజేందర్‌ను పలువురు పోలీసులు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, హెడ్ కానిస్టేబుళ్లు దశరథం, తిరుపతయ్య, రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా



ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో బోరుబావిని తవ్విస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సికిందర్‌రెడ్డి

మంచాల, ఏప్రిల్ 18: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సికిందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలం ఆరుట్ల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు రూ. లక్షా 20వేలతో రెండు బోరుబావులను తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా బోర్లను తవ్వించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎల్లేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, మాజీ ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ రాజు, గ్రామస్తులు జానీఫాషా, చంద్రయ్య, జంగయ్య, రాము, బుగ్గరాములు, సురేశ్, కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.

## చర్చీల్లో ప్రార్థనలు



మొయినాబాద్, ఏప్రిల్18:గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ మందిరాల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొయినాబాద్ మున్సిపాలిటి కేంద్రంలో ఉన్న మెథడిస్ట్ చర్చిలో శుక్రవారం పాస్టర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరులు గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు పాల్గొన్న యేసు ప్రభు భక్తులకు బైబుల్ వ్యాఖ్యాలను బోధించారు. యేసు ప్రభువు మరణించి సమాధి చేయబడిన దినంను పురస్కరించుకుని గుడ్ ఫ్రైడేను నిర్వహిస్తారు. మట్టల ఆదివారం అనంతరం మొదటి శుక్రవారం రోజున యేసూ క్రీస్తు మరణం పొందడంతో ఆయనను సమాధి చేయబడటంతో శుక్రవారం ఒక్క రోజు క్రైస్తవ సోదరులు ఉపవాస్య దీక్షలు చేశారు. ఉపవాస్య దీక్షలు చేపట్టిన క్రైవస్తవులు ప్రార్థనా మందిరాలకు వెళ్లి రోజాంత అక్కడే గడిపారు. మొయినాబాద్ మున్సిపాలిటి కేంద్రంతో పాటు పెద్దమంగళారం, అజీజ్‌నగర్, సురంగల్, శ్రీరాంనగర్, కనకమామిడి, అప్పారెడ్డిగూడ, ఎల్కగూడ, చిన్నమంగళారం, చిలుకూరు, హిమాయత్‌నగర్, ఎన్కేపల్లి, అమ్డాపూర్, ముర్తుజాగూడ, నాగిరెడ్డిగూడ గ్రామాల్లో గుడ్ ఫ్రైడే నిర్వహించారు.

## పశుసంరక్షణకు టీకాలు వేయించాలి

కందుకూరు, ఏప్రిల్ 18:పాడి రైతులు ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని మండల పరిధిలోని రాచులూరు పశువైద్య డాక్టర్ ఎండి షైన్ షేక్ తెలిపారు. మండల పరిధిలోని మీర్ఖాన్ పేట గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులకు చికిత్స చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు. ఎల్ఎస్ ఏగా నాగు నాయక్‌ను నియమించమన్నారు. కార్యక్రమంలో శివకుమార్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పూలే చౌరస్తా విస్తరణకు

# మోక్షమెప్పుడో..?

- కొత్తూరు ప్రధాన రోడ్డులో ట్రా'ఫికర్'
- జేపీ దర్గా, పెంజర్ల మార్గాలకు వెళ్లాలంటే జంకుతున్న వాహనదారులు
- షాద్‌నగర్ వైపు వెళ్లే బస్టాప్ కూడా అక్కడే..
- చౌరస్తాను విస్తరించాలంటున్న ప్రజలు



వాహనాలతో కిక్కిరిసి పోయిన కొత్తూరు పూలే చౌరస్తా

కొత్తూరు, ఏప్రిల్ 18: అది ప్రధాన చౌరస్తా. ఎప్పుడు చూసినా రోడ్డు నిండా వాహనాలే. బస్టాప్ నిండా జనాలే. అంతే కాకుండా పెంజర్ల రోడ్డు, ఏపీ దార్గా వెళ్లే మార్గం కూడా ఈ చౌరస్తా నుంచే వెళ్తుంది. కానీ ఈ ప్రధాన చౌరస్తా విస్తరణకు మాత్రం నోచుకోవడంలేదు. వివరాల్లోకి వెళితే... కొత్తూరు పూలే చౌరస్తాలో ఎప్పుడు చూసినా ట్రాఫిక్ ఇబ్బందులే. వాహనాలు, జనాలతో నిండి ట్రాఫిక్ సమస్యలకు నిలయంగా మారుతుంది. అలాంటి చౌరస్తా విస్తరణ ముందుకు సాగడంలేదని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు.

**చౌరస్తా దాటాల్సిందే..**

కొత్తూరు నుంచి ఎటు వైపు వెళ్లాలన్నా పూలే చౌరస్తా దాటి వెళ్లాల్సిందే. హైదరాబాద్ నుంచి జేసీ దర్గాకు ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు వెళ్తుంది. ఈ బస్సులన్నీ పూలే చౌరస్తా మీదుగా వెళ్లాల్సిందే. అంతే కాకుండా షాద్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి షాద్‌నగర్‌కు వెళ్లాలన్నా చౌరస్తాను దాటి వెళ్లాలి. దీంతో పాటు ప్రధాన వ్యాపార మార్గం పెంజర్ల రోడ్డుకు వెళ్లాలన్నా ఈ చౌరస్తాను క్రాస్ చేయాల్సిందే. అలాంటి ప్రధాన చౌరస్తా విస్తరణకు ప్రభుత్వం మొగ్గు చూపడంలేదని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. ఉదయమైందంటే చౌరస్తా లో అడ్డా లేబర్ నిలబడి ఉంటారు. దీంతో వాహనదారులు నానా కష్టాలు పడుతున్నారు.

**చౌరస్తాపై విస్తరణపై శ్రద్ధ ఏదీ ?**

అత్యంత ట్రాఫిక్ రద్దీ ఉంటే ప్రధాన చౌరస్తా విస్తరణపై ప్రభుత్వం శ్రద్ధ చూపడంలేదని వాహనదారులు వాపోతున్నారు. కొత్తూరు వై జంక్షన్ నుంచి పూలే చౌరస్తా వరణకు నూతన రోడ్డును నిర్మించారు. అలాగే పూలే చౌరస్తా నుంచి జేపీ దర్గా వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇంకా షాద్‌నగర్ వైపునకు వెళ్లే రైలే బ్రిడ్జిని విస్తరించి రోడ్డును నిర్మించారు. కానీ అన్ని వాహనాలు వచ్చే ప్రధాన చౌరస్తా విరణకు మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారని వాహనదారులు వాపోతున్నారు.

**కూల్చివేతలు తప్పనిసరి**

ప్రధాన చౌరస్తా విస్తరణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. విస్తరణకు అడ్డుగా ఉన్న నిర్మాణాలు తొలగించాల్సిందే అని పుర ప్రజలు, వాహనదారులు స్పష్టం చేస్తున్నారు. పెంజర్ల రోడ్డు నుంచి చౌరస్తాకు వచ్చే మార్గం ఇరుగ్గా ఉంది. దీన్ని ఇలానే ఉంచి విస్తరణ చేపడితే ఉపయోగంలేదని వాహనదారులు చెబుతున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవ తీసుకొని చౌరస్తా విస్తరణకు అన్ని వర్గాలను ఒప్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆమనగల్లు, ఏప్రిల్18: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత, కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే ప్రభుత్వం లక్ష్యంమన్నారు. ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తున్న రైతులకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలోని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీశైలం, అజీమ్, రవీందర్, సంపత్ కుమార్, అంజయ్యగుప్తా, వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పాండు రంగయ్య, రవీందర్, యాదయ్య, రమేశ్, నరేశ్ నాయక్ పాల్గొన్నారు.

### భూ బాధితులకు న్యాయం చేయాలి

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 18 : శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు భూ ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 98వ రోజుకు చేరాయి. భూ బాధితులు మాట్లాడుతూ.. తమ వద్ద నుంచి అక్రమంగా తీసుకున్న భూములను తిరిగి అప్పగించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీక్షలో గోపి, సోనిబాయి, తులసి, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు మర్రివాగు రాజు, గిరిజనులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

కడ్తాల్, ఏప్రిల్ 18: ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు గ్రామాలు, తండాల నుంచి నాయకులు, కార్యకర్తలు సైన్యంలా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, వెంకటయ్య, రమేశ్, లింగం గౌడ్, గౌడ సంఘం మండలాధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీశైలంయాదవ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

ఆమనగల్లు, ఏప్రిల్18: ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2000–01 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు శుక్రవారం లక్ష్మీగార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నాడు బోధన చేసిన పూర్వ ఉపాధ్యాయులు అనంతరెడ్డి, బాలబ్రహ్మం, ఎలిజా బెత్, శోభారాణి, శ్యామల దేవి, బుచ్చమ్మ, పద్మలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోని పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ




వివరాలు తెలుసుకుంటున్న రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

వనస్థలిపురం, ఏప్రిల్ 18: రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు శుక్రవారం సాయంత్రం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. రాచకొండ కమిష నరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించడానికి తనిఖీలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ రికార్డుల ను పరిశీలించడంతో పాటు రిసెప్షన్, పెట్రో లింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బం ది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ పూర్తి వివరాలను కమిషనర్‌కు వివరించారు.

## మొరాయిస్తున్న ట్రాఫిక్ సర్వర్లు

కొండాపూర్ : డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ ఉల్లంఘనలలో పట్టుబడిన వాహనదారులు సర్వర్లు పనిచేయకపోవడంతో కౌన్సెలింగ్‌కు తిరుగడం పరిపాటు అయ్యింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ ట్రాఫిక్ పీఎస్‌లో కొనసాగుతున్న కౌన్సెలింగ్ సెంటర్‌లో మూడు రోజులుగా సర్వర్లు పనిచేయడం లేదు. సర్వర్లు మొరాయిస్తున్నా ముందస్తు సమాచారం లేకపోవడంతో తిరుగు ప్రయాణం అవ్వాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కౌన్సెలింగ్ కోసం వాహనదారులు రెండు, మూడు సార్లు వచ్చినా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం కౌన్సెలింగ్ కోసం మూడోసారి వచ్చిన వారికి సైతం సోమవారం లేదా మంగళవారం రావాలంటూ ట్రాఫిక్ పోలీసులు సూచించినట్టు సమాచారం.

## గొల్ల కురుమల సంక్షేమానికి కృషి



కురుమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 18 : గొల్లకురుమల సంక్షేమానికి కృషి చేస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధి దేవునిఎర్రవల్లి వార్డులో నిర్మించిన కురుమ సంఘం భవనాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తితో కురుమలు ఆర్థికాభివృద్ధి, వారి హక్కులు పొందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. దేవునిఎర్రవల్లిలో కురుమ భవన్ ఏర్పాటుకు కృషి చేసిన సంఘం సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, హైదరాబాద్ బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, కురుమ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు రాములు, శ్రీశైలం, దేవునిఎర్రవల్లి కురుమ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సంఘం ఉపాధ్యక్షుడు రాజు, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్‌కుమార్, మాజీ సర్పంచ్ శ్యామలయ్య, స్థానిక నేతలు చంద్రయ్య, మల్లేశ్, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నర్సింహ, నవీన్, రవి పాల్గొన్నారు.

## పంట మార్పిడి పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 18 : రైతులు పంట మార్పిడి పద్ధతులను పాటించాలని ఆచార్య కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ విద్యార్థులు రైతులకు సూచించారు. శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడలో పర్యటించి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఒకే రకమైన పంటలను దీర్ఘకాలం సాగు చేయడంతో పంటలను చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని, పంట మార్పిడి వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఉద్యాన విద్యార్థులు స్వాతి, ప్రీతి, అఖిల, లావణ్య, శారద, సంతోష, సానియా, రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, ఏప్రిల్ 18 : తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్‌లో సాధారణ మరమ్మతుల కారణంగా తుర్కయాంజాల్ సబ్ స్టేషన్ పరిధిలోని పార్వతీపురం, గైరాన్ కోట, ఎంఎన్ఆర్ హోమ్స్, ద్వారకపురి, మర్రిగూడ, రాగన్నగూడ, కుర్మల్‌గూడ, ఆదిభట్ల ప్రధాన రహదారి, లక్ష్మి మెగా టౌన్‌షిప్, సూరజ్‌నగర్, వైఎస్సార్ నగర్ కాలనీ, హెవెన్స్ కార్నర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, ఎంఎం కుంట, గంగిరెడ్డి నగర్ కాలనీలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

**మొయినాబాద్ పరిధిలో..**

**మొయినాబాద్ :** విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ హాము శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ ఫీడర్ 11 కేవీ నుంచి ఉదయం 10 నుంచి 1 గంట వరకు, శ్రీనిధి ఫీడర్–1 నుంచి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ గ్రామాలతో పాటు ఆ గ్రామాల రెవెన్యూ పరిధిలో ఉన్న ఫామ్ హౌస్‌లకు కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు సహకరించాలని కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మాడ్గుల, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని ఆర్కపల్లి గ్రామంలో ఏర్పుల రాములమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఉప్పల వెంకటేశ్‌గుప్తా రూ.3వేలు, బీఆర్ఎస్ నాయకులు సింగల్ విండో డైరెక్టర్ రాజవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించి. రూ.2వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలోని బీఆర్ఎస్ యువ నాయకులు శివలింగం, శంకర్‌గౌడ్, రాములు, మైసయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 18 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం సభ్యుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ టీచర్స్ కాలనీలోని శ్రీ సాయిగణేష్ మందిరంలో నిర్వహించనున్న నియోజకవర్గం బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలో బ్రాహ్మణులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రాఘవరావు, ప్రధాన కార్యదర్శి సుజన్‌కుమార్, కోశాధికారి మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు కిషన్‌రావు పాల్గొననున్నారని సంఘం సభ్యులు తెలిపారు.

## బాల్య మిత్రుడికి ఆర్థిక సాయం

కందుకూరు, ఏప్రిల్ 18: బాల్య మిత్రుడికి తోటి మిత్రులందరూ ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని ఆకుల మైలారం జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో 1992 –93 సంవత్సరంలో 10వ తరగతి తమతో చదువుకున్న విద్యార్థి, బాల్యమిత్రుడు రవీందర్ భార్యకు పక్షవాతం వచ్చి కుటుంబం ఇబ్బందులు పడుతుండగా అలనాటి మిత్రులు విషయం తెలుసుకొని రూ.40 వేలను శుక్రవారం అందజేశారు.

# పేరుకే పురపాలకం..రోడ్లన్నీ అస్తవ్యస్తం

- ఫతేపూర్ రైల్వే బ్రిడ్జి, శంకర్‌పల్లి ప్రధాన రోడ్లు గుంతలమయం
- నరకయాతన పడుతున్న ప్రయాణికులు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 18 : పేరుకే శంకర్‌పల్లి మున్సిపాలిటీ. ఇక రోడ్ల పరిస్థితి అంటే అంతే సంగతి. చేవెళ్ల నుంచి శంకర్‌పల్లికి వెళ్లాలంటే ఫతేపూర్ రైల్వే వంతెన దాటి వెళ్లాలి. ఫతేపూర్ బ్రిడ్డి రోడ్డు పూర్తిగా గుంతలమయై దుమ్ము లేస్తోంది. చిన్నపాటి వర్షాలు కురిస్తే అంతే సంగతి చెరువును తలపించేలా ప్రధాన రోడ్డు తయారవుతోంది. సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య ఏర్పడినప్పుడు పరిశీలించి వెళ్లడే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

**నాణ్యత, సరైన ప్రణాళిక లేకనే..**

శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి ఫతేపూర్ రైల్వే వంతెన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, సరైన ప్రణాళిక రూపొందించకపోవడంతోనే రోజురోజుకూ సమస్య అధికమవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. రోడ్డులో మట్టి కిందకు కూరుకుపోవడంతో పాటు, వర్షం నీరు సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఒక వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. చిన్న పాటి వర్షం పడితే రోడ్డును ముసివేసే పరిస్థితి నెలకొంటున్నది.



రైల్వే వంతెన రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించి అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్న దృశ్యం



గుంతలమయంగా శంకర్‌పల్లి ఫతేపూర్ రైల్వే వంతెన రోడ్డు

**రాత్రిపూట ప్రమాదాలు అధికం..**



శంకర్‌పల్లికి రావాలన్నా.. ఈ రోడ్డు గుండా వెళ్లాలన్నా చిరాకేస్తోంది. రోడ్డు నిబంధలనలు పాటించకుండా ఎట్ల పడితే అట్ల వాహనాలు వెళ్తున్నాయి. రాత్రి పూట ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్, ప్రయాణికుడు, దేవునిఎర్రవల్లి

**ఇబ్బందులు పడుతున్నాం..**



మా గ్రామం నుంచి రోజుకు మూడు, నాలుగు సార్లు శంకర్‌పల్లికి వస్తుంటాం. ఈ రోడ్డు నుంచి వెళ్లాలంటేనే భయమేస్తుంది. లారీలు, హెవీ వెహికిల్స్ వస్తుంటాయి. రోడ్డు బాగా లేకున్నా స్పీడ్‌గా వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇక్కడ ఒక సర్కిల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రమేశ్, ప్రయాణికుడు, చందిప్ప, శంకర్‌పల్లి మండలం

**మూడు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం**

గుంతలమయమైన రోడ్డుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ముందుకు సాగుతున్నాం. ఫతేపూర్ రైల్వే వంతెన రోడ్డుకు రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ

**రూ.17 లక్షలు ప్రతిపాదించాం..**



మున్సిపల్ పరిధిలోని రామంతాపూర్, ఫతేపూర్ వార్డుల పరిధిలోని కల్వర్టు ఏరియాలో రోడ్డు మరమ్మతులకు మున్సిపల్ నిధుల నుంచి రూ.17 లక్షలు ప్రతిపాదించాం. అంతలోనే ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వేస్తామన్నారు. రైల్వే వంతెన రోడ్డును పరిశీలించాం. ఆర్అండ్‌బీ అధికారులు త్వరలోనే మరమ్మతులు చేపడుతామన్నారు.

– యోగేశ్, శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్



వంతెన కింద మట్టిని తవ్వి వదిలేసిన అధికారులు